ఖాతాదారుల వెతలు తీరవా?

- ఏకైక ఎస్‌బీఐ బ్రాంచి బ్యాంకు
- సిబ్బంది కొరత, కౌంటర్ల సమస్య
- చిన్న పనికి రోజంతా పడిగాపులు
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు


బ్యాంకులో బారులు తీరిన ఖాతాదారులు

బొంరాస్‌పేట: మండలం మొత్తానికి ఎస్‌బీఐ ఏకైక దిక్కు. ఇక్కడ బ్రాంచులో 20వేల మందికి పైగా ఖాతాదారులు ఉన్నారు. చిన్న పనికి రోజంతా పడిగాపులు, నెలలు గడిచినా పూర్తికాని ఖాతాదారుల సమస్యలు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. బ్రాంచులో సిబ్బంది కొరత, కౌంటర్ల సమస్యతో వినియోగదారుల కష్టాలు అంతో ఇంత కాదు. దీనిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోరు. ఖాతాదరులు మాత్రం ఈ బ్యాంకు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పరిధిలో 11 గ్రామాలు, 99 గిరిజన తండాలున్నాయి. ఈ బ్యాంకు సేవలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉండాల్సిన సిబ్బంది..

ఈ బ్రాంచులో ఖాతాదారులు, వినియోగదారుల రద్దీ దృష్ట్యా కనీసం ఇద్దరు ఫీల్డ్ ఆఫీసర్లు, అకౌంటెంట్, క్లర్క్, రెండు క్యాష్ కౌంటర్లు ఉండాలి. కానీ క్లర్క్, ఇద్దరు కాంట్రాక్టు సిబ్బంది, ఫీల్డ్ అధికారి, మేనేజరు ఉన్నారు. సిబ్బంది కొరత కారణంగా బ్రాంచులో నిత్యం వినియోగదారులు, ఖాతాదారుల వెతలు తీరడం లేదు.

మండలం ఏర్పాటైనప్పటి నుంచి ..

మండలం ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడ ఒకటే బ్యాంకు మాత్రమే ఉంది. వ్యవసాయ ప్రధానంగా ఉన్న మండలంలో రైతులకు, ప్రభుత్వ పథకాల అమలుకు మరో గ్రామీణ వికాస్ బ్యాంకు లాంటివి ఏర్పాటు చేయాల్సిన బాధ్యాత ఉన్నతాధికారులపై ఉందని ఖాతాదారులు సూచిస్తున్నారు. ఇటీవల యూనియన్ బ్యాంకు ఏర్పాటుకు సర్వే పూర్తి చేశారు. ఇక్కడ బ్రాంచ్‌లో సిబ్బందిని నియమించాలని, క్యాష్ కౌంటర్లు పెంచాలని పలు రకాల సమస్యలను మూడు నెలలుగా చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు బ్రాంచు మేనేజరుకు విన్నవించినా, హైదరాబాద్‌లోని ఆర్‌ఎంకు చెప్పినా స్పందన లేదని ఆయా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్రాప్ లోన్ రెన్యూవల్ కోసం..



మూడు నెలల నంచి తిరుగుతున్నా. రేపు, మాపు అంటూ ఫోన్ చేస్తేనే రావాలని చెబుతున్నారు. ఫోన్ చేయడం లేదు. ఇలా కేవీసీ, ఈ కేవైసీ అంటూ లైన్‌లోనే గంటల తరబడి ఉండాల్సి వస్తూంది.

– గోరిబాయి, మెట్లకుంట తండా

బ్రాంచుల సంఖ్య పెంచాలి



మండలంలో ఒకటే బ్యాంకు ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరి కొన్ని బ్యాంకులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. రైతులకు, మహిళలకు, రోజూవారి ఖాతాదారులకు, పెట్టుబడి దారులు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే బ్రాంచుల సంఖ్య పెంచాలి.

– రాములు, దుప్‌చర్ల

నిరాహార దీక్షలు చేసినా..



బ్రాంచులో వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు మా సంఘం పక్షాన వినతులు, దీక్షలు చేస్తున్నాం. సిబ్బందిని నియమించాలని, కౌంటర్ల సంఖ్యను పెంచాలని, కేవైసీ, ఈకేవైసీ మూడునెలల క్రితం నిరాహార దీక్షలు చేసినా స్పందన లేదు. తహసీల్దారుకు, ఎస్బీఐ ఆర్‌ఎంకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– కొత్తూరు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి, జిల్లా అధ్యక్షుడు

అభివృద్ధే ధ్యేయం


ముజాహిద్‌పూర్‌లో మురుగు కాల్వల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: పేదల అభివృద్ధే ధ్యేయమని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో మురుగు కాల్వల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు. సీసీరోడ్ల ఏర్పాటు, విద్యుత్తు లైన్ల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రభూపాల్, భాస్కర్, సోమలింగంపాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: నర్సాపూర్‌లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను గురువారం మాజీ సర్పంచ్ నర్సి ములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కాలనీకి సీసీ రోడ్డు వేయనున్నామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రావు కృషితో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయనున్నామన్నారు.

కుల్కచర్ల వైద్యాధికారిగా కిరణ్

సాక్షి ఎఫెక్ట్..



కుల్కచర్ల: గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు అవసరమైన ఓపీ డాక్టర్ లేక కులకచర్ల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని 'సాక్షి' దినపత్రికలో 'సర్కారు ఆసుపత్రికి సుస్తీ' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించారు. ఈ కథనానికి స్పందించిన జిల్లా అధికారులు పరిగిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు కిరణ్‌ను కుల్కచర్ల మండలానికి నియమిస్తూ జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం జిల్లా వైద్యాధికారుల ఆదేశాలననుసరించి ఆయన శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

బంట్వారం: ఉపాధి హామీ పథకం పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేషం గురువారం బంట్వారంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారానికి సంబంధించి కొత్త పనులను చేపట్టాలన్నారు. జాబ్ కార్డు కలిగిన కూలీలందరూ పనులకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అంటే ప్రజలది కాదా?

- హెచ్‌సీయూ భూములను వదిలేయాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మొయినాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400ల ఎకరాల భూమిని ప్రభుత్వం ఎందుకు అమ్ముతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి ప్రశ్నించారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ప్రభుత్వ భూములను అమ్మొద్దని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఎందుకు అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వ భూమి అంటే ప్రజలది కాదా అని ప్రశ్నించారు. హెచ్‌సీయూకు చెందిన 400ల ఎకరాల భూమి జీవవైవిధ్యానికి నెలవుగా ఉందని, హైదరాబాద్ మహానగరానికి పచ్చదనాన్నిచ్చే భూముల్లో బుల్డోజర్లు దింపి సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా హెచ్‌సీయూ భూములను వదిలేయాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జయవంత్, సుధాకర్‌యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొత్త మాణిక్ రెడ్డి, మోర శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చింది..

- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- రోడ్లపై చేరిన వర్షపు నీరు
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు


దుద్యాల్: హస్నాబాద్‌లో కురుస్తున్న వాన

అనంతగిరి: వికారాబాద్‌లో గురువారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడ కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తాండూరు: తాండూరు పట్టణంలో ఓ మోస్తారుగా కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. గత వారం రోజులుగా ఉక్కపోతతో జనాలు సతమతమయ్యారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. పలు ప్రాంతాలలో మధ్యాహ్నం నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రి 8.30 గంటల తర్వాత విద్యత్ సరఫరాను పునరుద్దరింపచేశారు. ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులతో తాండూరు నియోజకవర్గంలో వాతావరణం చల్లబడింది.

దోమ: గురువారం సాయంత్రం దోమ మండల వ్యాప్తంగా వర్షం దంచి కొట్టింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

బొంరాస్‌పేట: ఎండలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సాయంత్రం కురిసిన అకాల వర్షం ఉపశమనాన్నిచ్చింది. గురువారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.

దుద్యాల్: మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొడంగల్ నుంచి దుద్యాల్ విద్యుత్ కేంద్రానికి సరఫరా అయ్యే ప్రధాన విద్యుత్ లైన్‌పై చెట్టు వరగడంతో అంతరాయం ఏర్పడింది. దుద్యాల్, కొడంగల్ మండలాలకు విద్యుత్ సరఫరా దాదాపుగా 2 గంటల పాటు నిలిపివేశారు.


తాండూరులో కురుస్తున్న వర్షం


రాకొండలో దంచి కొడుతున్న వర్షం

క్లుప్తంగా

సహకార సంఘం ఉద్యోగికి సన్మానం


సురేశ్‌ను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

కుల్కచర్ల: కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న బి సురేశ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఉద్యోగాన్ని పొందిన నేపథ్యంలో గురువారం సహకార సంఘం చైర్మన్ కనకం మొగులయ్య, సీఈఓ బక్కారెడ్డిలు ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రతిభ ఉంటే ఎక్కడికెళ్లినా గుర్తింపు, గౌరవం లభిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండయ్య, సిబ్బంది హలీం, మురళీ, మల్లికార్జున్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైనికులుగా ఎంపికైన అన్నదమ్ములకు సన్మానం


సన్మానిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

ధారూరు: భారత ఆర్మీలో సైనికులుగా ఎంపికైన ఇద్దరు అన్నదమ్ములను గురువారం ధారూరు మండల మాజీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు కుర్వ శివ, విష్ణు ఇటీవల ఆర్మీలో సైనికులుగా ఎంపికై న విషయం తెలిసిందే. వారికి ఆయన స్వీటు తినిపించి, శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కుమ్మరి శ్యామలయ్య, శ్రీనివాస్, వెంకట్రాంరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

తహసీల్దార్ విజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధం కావాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్టును పరిశీలించుకోవాలని సూచించారు. ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే తెలియ చేయాలన్నారు. ప్రతి పార్టీ నుంచి బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు పట్టణ మాజీ సర్పంచ రమేష్‌బాబు, సీపీఐ నాయకుడు సిరుసని శ్యాంసుందర్, బీజేపీ నాయకులు మురళీధర్ రెడ్డి, కృష్ణయాదవ్, ఎంఐఎం తాలూకా అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్, కాంగ్రెస్ నాయకుడు ఆసీఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

టీఎంఎఫ్ డైరీ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: తెలంగాణ గణిత ఫోరం వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్రచురించిన డైరీని గురువారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు బాలకుమార్, శ్రీనివాస్‌రావు, రవీందర్‌రెడ్డి, సంతోష్, బస్సు, జగదీశ్వరి, యశోద పాల్గొన్నారు.

నేడు పాంబండ ఆలయ హుండీ లెక్కింపు

కుల్కచర్ల: శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీని శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

కొడంగల్ రూరల్: కురుమ సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఘనంగా దొడ్డి కొమురయ్య కురుమ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ నాగప్ప మాట్లాడుతూ తెలంగాణ వేగు చుక్క దొడ్డి కొమురయ్య నాటి నైజాం ప్రభుత్వానికి, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధైర్యశాలి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు కె.దస్తప్ప, కె.మధు, కె.పరమేశ్, నర్మదా కిష్టప్ప, కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సన్నబియ్యం

ఎమ్మెల్యే కాలె యాదయ్య


నవాబుపేట: సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి పేదోడికి రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీత సింగ్ నాయక్, తహసీల్దార్ జయరాం, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు, నందారం ప్రశాంత్, గోడల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని రేషన్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో గాంధీనగర్‌లోని 7వ రేషన్ దుకాణంలో కాంగ్రెస్ నాయకులు సోమశేఖర్, దాము పంపిణీ చేశారు. 2వ వార్డులో 4వ రేషన్ దుకాణంలో మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ ప్రారంభించారు.

పంపిణీ చారిత్రక నిర్ణయం

యాలాల: పేదలకు సన్న బియ్యం పంపిణీ చారిత్రక నిర్ణయమని కాంగ్రెస్ నాయకురాలు పేరి సరితా రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో తాండూరు ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్నపురి నర్సింహులు, నాగయ్య, మోయిజ్, అహ్మద్, మారుతీ, అశోక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పండుగ

బొంరాస్‌పేట: సన్నబియ్యం పంపిణీ గిరిజనులకు పండుగలాంటిదని కాంగ్రెస్ మండల గిరిజన నాయకుడు, మాజీ సర్పంచు మోత్యానాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బాపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేశారు. ×రోటి కప్డా ఔర్ మకాన్× అనే ఇందిరమ్మ నినాదాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు ధర్మేందర్, మహేందర్‌సింగ్, రతన్, చందర్, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: సన్నబియ్యం పంపిణీ దేశంలోనే చరిత్రాత్మకమని మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొటం రాములు తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో గురువారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సిములు, అశోక్ పాల్గొన్నారు.


కొడంగల్: ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రతీ లబ్ధిదారుడికి సన్నబియ్యం అందాలి

తాండూరు రూరల్: ప్రతీ లబ్ధిదారుడికి సన్న బియ్యం అందజేయాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..తాండూరు పట్టణం, రూరల్ కలిపి 48 రేషన్ దుకాణాల్లో 31,012 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. ప్రతీ నెల 6,507 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి 6కిలోల సన్న బియ్యం ఉచితంగా అందజేయాలని డీలర్లకు సూచించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

దుద్యాల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఈర్లపల్లి, సంగాయిపల్లి గ్రామాల్లో ఆవుటి శేఖర్, వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు, సామాన్యులు కూడా సన్న బియ్యంతో అన్నం తినాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ శంకర్ నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: గుండ్లమర్పల్లి, మర్పల్లి, రావులపల్లి, పంచలింగాల, కొత్లాపూర్, పట్లూర్‌తో పాటు పలుగ్రామాల్లో సన్నబియ్య పంపిణీ కొనసాగుతుందని అధికారులు, డీలర్లు పేర్కొన్నారు.


యాలాల: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సరితా తదితరులు

బంట్వారం: సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి బంట్వారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి పాల్గొన్నారు.

తెరుచుకోని రేషన్ షాపు


యాలాల: తెరుచుకోని రేషన్‌షాపును చూపుతున్న యువకులు

యాలాల: మండల కేంద్రంలో రేషన్ షాపు తెరుచుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం తాండూరు నియోజకవర్గంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని షాపు నెంబరు 17 ఉదయం నుంచి తెరుచుకోకపోవడంతో స్థానిక యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు సంబంధిత డీలరుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


దుద్యాల్: ఈర్లపల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు


బొంరాస్‌పేట: బాపల్లిలో పంపిణీ చేస్తున్న నాయకులు


బంట్వారం: సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న వెంకటేషం